క్లుప్తంగా

కుమారస్వామికి విశేషపూజలు



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ,అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఈఓఎస్.లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి

శ్రీశైలం: క్షేత్ర వ్యాప్తంగా దేవస్థాన ఉద్యానవనాలు, పరిసర ప్రాంతాల్లో కార్తికేయ ఏజెన్సీ కింద పనిచేస్తున్న తోటమాలిలకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని శ్రీభ్రమరాంబామల్లికార్జున కాంట్రాక్ట్ తోటమాలి లేబర్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం దేవస్థానం అతిథిగృహంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్‌రెడ్డివారిచక్రపాణిరెడ్డికి వినతిపత్రం అందించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు వై.ఆశీర్వాదం మాట్లాడుతూ.. 15 ఏళ్లుగా కార్తికేయ ఏజెన్సీ ద్వారా తోటమాలిలుగా పనిచేస్తున్న వారికి రూ.8 వేల నెలసరి వేతనాలు ఇస్తున్నారని, టెండర్లు రెండు విభాగాలుగా చేసి కొందరికి రూ.8,700 చెల్లిస్తున్నారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ జీతం సరిపోక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో తోటమాలీలు గోపాల్‌నాయక్, శ్రీను, మల్లేష్, మహేశ్వరరెడ్డి, లింగం, రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి

పాములపాడు: ఉగాది పర్వదినం నాటికి జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ సుమిత్రమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని వేంపెంట గ్రామ సచివాలయంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని లబ్ధిదారులందరూ గృహనిర్మాణాలు పూర్తి చేసేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో సర్పంచు మాణిక్యమ్మ, ఏఈ హౌసింగ్ శివరామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి తిప్పన్న పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే మినుములో వైరస్ నిర్మూలన



మినుములో యాజమాన్య పద్ధతులను రైతులకు వివరిస్తున్న ఏఓ హేమలత

పాములపాడు: మినుము పైరులో వైరస్ నిర్మూలనకు ఎలాంటి క్రిమి సంహారక మందులు లేవని, జాగ్రత్తలు పాటించడంతోనే వైరస్‌ను నివారించవచ్చని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏఓ హేమలత అన్నారు. మంగళవారం కొత్తపల్లి మండలంలోని నందికుంట గ్రామంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మినుములో తెల్లదోమ, తామర పురుగులు, పేనుబంక పురుగు కలుపు మొక్కల నుంచి ఇతర మొక్కలకు వ్యాప్తి చెందుతుందన్నారు. విత్తనం వేసే సమయంలోనే పైరు చుట్టూ రక్షక పంటలను వేసుకోవాలని సూచించారు. పొలం గట్ల మీద కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ మహేష్, ఏఈఓ వెంకట నారాయణ, వీఏఓలు శివకృష్ణనాయక్, జహీద్, శేషు పాల్గొన్నారు.

పాసులు అనుమతించాలి

మహానంది: పలువురు బస్సు డ్రైవర్లు, కండక్టర్లు ఆల్ట్రా పల్లెవెలుగు, ఇతర పేర్లతో బస్సు పాసులను అనుమతించకపోవడంతో గాజులపల్లె నుంచి నంద్యాలలోని కళాశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. నంద్యాల-గిద్దలూరు మార్గంలో బస్సుల్లో పాసులు అనుమతించి కళాశాలలకు సరైన వేళలకు వెళ్లేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బీమా సాయం అందజేత

మిడుతూరు: కడుమూరు సచివాలయ పరిధిలో తెలుగు శివశంకర్ అనారోగ్యంతో ఈనెల 30న మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి కల్యాణ్ సింగ్ బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను నామినీ అయిన శారదకు గ్రామ సర్పంచ్ జీవరత్నం చేతుల మీదుగా మంగళవారం అందజేశారు.

వేతనాలు ఇవ్వాలి

బండిఆత్మకూరు: స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకులు రత్నమయ్య, మండల నాయకులు రాజు కోరారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్మికులు ఎంపీడీవో వాసుదేవ గుప్తాకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్మికులకు గత 13 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు తిమ్మయ్య, పాలరాజు, శిఖామణి, పాల్గొన్నారు.

కమనీయం.. బరక సంజీవరాయుడి కల్యాణం

- ఘనంగా ఆలయ 12వ వార్షికోత్సవం
- భక్తజనసందోహం మధ్య రథోత్సవం

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరకసంజీవరాయ స్వామి ఆలయ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా, వేదమంత్రోచ్చరణల మధ్య కమనీయంగా సాగింది. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం, విశేషపూజాధిత కార్యక్రమాలను నరహరి శర్మ, వెంకటేశ్వర్లు, కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం పేరెడ్డి రామేశ్వరరెడ్డి, సురేఖ, (రోళ్లపాడు గ్రామం) దంపతులు, జిల్లెల్ల రాజగోపాల్‌రెడ్డి, ఉషారాణి (పలుకూరు గ్రామం) దంపతులు ఉభయదారులగా వ్యవహరించి సీతారాముల కల్యామాన్ని వైభవంగా జరిపించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. విశ్రాంత అధ్యాపకులు వేధపండితులు మల్లికార్జునరావు, ఆలయ చైర్మన్ పేరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, కల్యాణ మండపం చైర్మన్ పాలగ్గారి నాగిరెడ్డి, రోళ్లపాడు సర్పంచ్ రామస్వామిరెడ్డి, ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ, గ్రామ పెద్దలు పేరెడ్డి రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ పేరెడ్డి వెంకటరామిరెడ్డి, డాక్టర్ పేరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆలయ ప్రాంగణంలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలి.

బాల్యం నుంచి తమ పిల్లలకు ఆధ్యాత్మిక భావాలు అలవరుచుకునేలా పెంపకం ఉండాలని శ్రీ రామ దత్త ఆశ్రమం వ్యవస్థాపకులు జూలకంటి మల్లికారునరావు అన్నారు. సీతారాముల కల్యాణం అనంతరం భక్తులకు ఉపదేశించారు.

రమణీయం .. రథోత్సవం ..

ఆలయ 12వ వార్షికోత్సవం పురస్కరించుకొని రథోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి మేళతాళాలతో తీసుకవచ్చి రథంపై ఆశీనులను చేసి విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తజనుల జయజయ ధ్వానాల మధ్య రథోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రూరల్ సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్ఐ మారుతీశంకర్ ఆధ్వర్యంలో గట్టిబందోబస్తు నిర్వహించారు.



భక్తజనుల మధ్య రథం లాగుతున్న దృశ్యం

రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు ప్రారంభం

ఆలయ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని న్యూ కేటగిరీ విభాగం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లు శివనాగిరెడ్డి ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి 16 జతల ఎద్దు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లు శివనాగిరెడ్డి

మానవతా దృక్పథంతో సమస్యలు పరిష్కరించాలి

- అధికారులకు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ సూచన
- అల్లూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

నందికొట్కూరు(పగిడ్యాల): నిబంధనల పేరుతో ప్రజల పట్ల కర్కశంగా ప్రవర్తించకుండా మానవత్వం చూపి సమస్యలు పరిష్కరించాలని నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అధికారులకు సూచించారు. మంగళవారం అల్లూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వాన్ని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్లను పంపిణీ చేసి, సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటి వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ పథకాల ద్వారా చేసిన ఆర్థిక సాయాన్ని వివరిస్తూ మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు.



సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

వినతుల పరిష్కారానికి కృషి చేయాలి

గడప గడపలో ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఆయన మాట్లాడుతూ.. సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు ప్రభుత్వానికి రెండు కళ్లని, సమస్యల పరిష్కారం నిమిత్తం వచ్చే ప్రజలకు సాయం చేసేందుకు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. వలంటీర్లకు మంచి భవిష్యత్ ఉంటుందని నమ్మకంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శోభారాణి, ఈఓఆర్డీ సుబ్రమణ్య శర్మ, ఎంఈఓ ఫైజున్నీసా బేగం, వైస్ ఎంపీపీ కట్టా మంజుల, సింగిల్ విండో డైరెక్టర్లు సగినేల ఉసేనయ్య, హరిసర్వోత్తమరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రవీంద్రనాయుడు, అలంపూర్ శేఖర్, పాపన్న, సయ్యద్‌బాషా, మాంధ్ర వేదవతి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 11 నుంచి 21 వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి దేవస్థానం ఈఓ లవన్నను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను మంగళవారం వారు పరిశీలించారు. ఆలయ క్యూలైన్లు పరిశీలించి, ఎంతమంది భక్తులు వేచి ఉంటారు..అని ఈఓను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాగాలంకరణ కార్యక్రమం గురించి, వీఐపీల గ్యాలరీ ఏర్పాటు, ప్రొటోకాల్ దర్శన ఏర్పాట్లు, స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం జరిగే నాగులకట్ట ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఈఓకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, సభ్యులు మేరాజోత్ హనుమంత్‌నాయక్, మాధవీలత, విజయలక్ష్మి, దేవస్థాన ఏఈఓ ఫణీధర్, ఈఈ రామకృష్ణ, పీఆర్వో టి.శ్రీనివాసరావు, శ్రీశైల ప్రభ సంపాదకులు అనీల్‌కుమార్ ఉన్నారు.

చెంచు కాలనీలో కలెక్టర్ పర్యటన

శ్రీశైలం పరిధిలోని మేకలబండ చెంచుకాలనీలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మంగళవారం పర్యటించారు. చెంచుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నో ఏళ్లక్రితం నిర్మించిన ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, నూతనంగా ఇళ్లు నిర్మించాలని చెంచులు కలెక్టర్‌కు వివరించారు. అలాగే మరుగుదొడ్లు లేవని, వీధి దీపాలు కూడా లేక రాత్రివేళ అంధకారంలో తిరుగుతున్నామని తదితర తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారికి ఆదేశాలు జారీ చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అప్పుడే స్కూల్ నుంచి వస్తున్న చిన్నారులతో కలెక్టర్ ముచ్చటించారు. కలెక్టర్‌తో పాటు ఆత్మకూరు ఆర్డీఓ దాస్, తహసీల్దార్ రాజేంద్రసింగ్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.



చెంచు విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్

కుష్టు వ్యాధి నివారణకు కృషి చేద్దాం

శ్రీశైలం: కుష్టువ్యాధి నివారణకు కృషి చేద్దామని డీఎం అండ్ హెచ్ఓ కె.వెంకటరమణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ వద్ద కుష్టు వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా వ్యాధిని సమాజం నుంచి తరిమికొట్టేందుకు కృషి చేస్తామని వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ.. ఆశాకార్యకర్తలు ప్రతి ఇళ్లు తిరిగి వ్యాధి గ్రస్తులను గురించి మండల వైద్య ఆరోగ్య అధికారులకు సమాచారమివ్వాలని సూచించారు. పీహెచ్‌సీ డాక్టర్లు శోమశేఖరయ్య, డాక్టర్ శ్రవంతి, సీహెచ్ఓ రామారావు, పీహెచ్ఎన్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఆత్మకూరు: కుష్టు వ్యాధి రహిత సమాజాన్ని నిర్మిద్దామని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ నారాయణరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని పీహెచ్‌సీ వద్ద మంగళవారం పట్టణంలోని అన్ని వార్డు సచివాలయాల వైద్య సిబ్బందితో కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు లక్ష్మీదేవి, సుబ్బలక్ష్మి, ప్రశాంతి పాల్గొన్నారు.



శ్రీశైలం పీహెచ్‌సీ వద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎమ్అండ్ హెచ్ఓ

మరోసారి వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలి

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- వెలుగోడులో కొనసాగుతున్న 'గడప గడపకు మన ప్రభుత్వం'

వెలుగోడు: ప్రజా రంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కోరారు. మంగళవారం వెలుగోడు పట్టణంలోని ఇందిరానగర్, గాంధీనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. నంద్యాల రోడ్డులోని డీపాల్ స్కూల్ వద్ద మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. వేల్పుల రవికుమార్ ఎమ్మెల్యే శిల్పాను గజమాలతో సత్కరించారు. అనంతరం ఇంటింటా పర్యటించిన ఎమ్మెల్యే ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ఇందిరానగర్‌లో దాసరి చెన్నయ్య అనే వ్యక్తి ప్రమాదానికి గురై నడవలేని స్థితిలో ఉండటంతో గమనించిన ఎమ్మెల్యే రూ.5 వేలు తక్షణ ఆర్థికసాయం అందించారు. అలాగే సుబ్బరాయుడు పదేళ్ల కూతురు ప్రమాదానికి గురై నడవలేని స్థితిలో ఉండగా ఆ చిన్నారికి రూ.3 వేల సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆరోగ్యశ్రీ కార్డులో పేరు లేదని తల్లిదండ్రులు ఎమ్మెల్యే దష్టికి తీసుకెళ్లగా వెంటనే అధికారులతో మాట్లాడి ఆరోగ్యశ్రీ కార్డులో ఆ చిన్నారి పేరు నమోదు చేయించాలని సూచించారు. దివ్యాంగులు ఎలక్ట్రిక్ ట్రై సైకిల్ కావాలని కోరగా వెంటనే మంజూరు చేయించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పింఛన్లు, సీసీ రోడ్లు వేయించాలని స్థానికులు కోరగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డీపాల్ స్కూల్ పక్కన అంతర్గత రోడ్డును తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తానని శిల్పా చక్రపాణిరెడ్డి ఆర్‌సీఎం సిస్టర్స్‌కు హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేను సత్కరించిన బంజారాలు

గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని బంజార నాయకులు తమ సాంప్రదాయం ప్రకారం సత్కరించారు. మహారాష్ట్ర గోద్రి తండాలో నిర్వహించిన అఖిల భారత బంజారా కుంభ మేళాకు వెళ్లి వచ్చిన గుంతకందాల వెంకటేష్ నాయక్ ఐదు రోజులు అక్కడ జరిగిన విషయాలు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, జిల్లా కో-ఆప్షన్ మెంబర్ సయ్యద్ సులేమాన్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్‌ఖాన్, వైస్ ఎంపీపీలు నసిరుద్దీన్, శంకర్‌నాయక్, ఎంపీటీసీ రాజేష్, నాయకులు దేశం తిరుపంరెడ్డి, షంషీర్ అలీ, తెలుగు వెంకటరమణ, ఖాదర్‌వలి, ఆసీఫ్ అలీఖాన్, రవికుమార్, గోవిందు పాల్గొన్నారు.



ప్రమాదానికి గురైన వ్యక్తికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

నందికొట్కూరు(పగిడ్యాల): రాబోయే వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని మున్సిపల్ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక జైకిసాన్ పార్క్‌లో చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొదటి వార్డు కౌన్సిలర్ చిన్నరాజ్ మాట్లాడుతూ పట్టణంలో నీటి సమస్య తీవ్ర రూపందాల్చక ముందే నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. పైప్‌లైన్ల మరమ్మతులు, మోటార్లు మొరాయిస్తే స్టాండ్‌బై మోటర్లు అందుబాటులో ఉంచాలన్నారు. కొత్త పైప్ లైన్‌ను పొలాల్లో కాకుండా బండ్ల రస్తా వెంబడి వేయాలని కోరారు. అలాగే 24వ వార్డు కౌన్సిలర్ చాంద్‌బాషా, 21వ వార్డు కౌన్సిలర్ లక్ష్మిదేవి నీటి సమస్యపై ధ్వజమెత్తారు. దీంతో వాతావరణ ఒక్కసారిగా వెడెక్కడంతో కమిషనర్ కిశోర్ సంబంధిత శాఖ అధికారులకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అర్షపోగు ప్రశాంతి, కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్‌గఫార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మంచినీటి సమస్యపై మాట్లాడుతున్న 1వ వార్డు కౌన్సిలర్ చిన్నరాజ్

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఆత్మకూరు: వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ తిరుపాలమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణ కోసం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి బోర్ల మరమ్మతులు, అవసరమైన చోట కొత్త బోర్లు వేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు ఎంపీపీ తిరుపాలమ్మ, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎంఈఓ జానకీరాం, హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వరరెడ్డి, వైద్యాధికారి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

పాములపాడు: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఎస్‌డబ్ల్యూ అండ్ ఈఓ చింతామణి అన్నారు. మంగళవారం స్థానిక నారాయణరెడ్డి డిగ్రీ కళాశాల ఆవరణలో సాంఘిక సంక్షేమ శాఖ విద్యార్థినీవిద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూ వైవీ సుబ్బారెడ్డి, హెచ్‌డబ్ల్యూలు అనిత, ఉమాదేవి పాల్గొన్నారు.

బొల్లవరంలో బ్రహ్మోత్సవాలు

మహానంది: బొల్లవరం గ్రామంలో వెలిసిన శ్రీ రాజరాజేశ్వరీ, చంద్రమౌళీశ్వర కల్యాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు ఓరుగంట రాజారామకృష్ణశర్మ ఆధ్వర్యంలో మహాపూజ, హోమము, కుంకుమపూజలు చేశారు.

ఇసుక యార్డు పరిశీలన

ఆత్మకూరు: ఇసుక అక్రమంగా విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. పట్టణంలోని ప్రభుత్వం ఇసుక యార్డును మంగళవారం సీపీఐ నాయకులు పరిశీలించారు. వెంకటశివుడు, రఘురామ్మూర్తి, రాముడు పాల్గొన్నారు

మహానందీశ్వరుడి సన్నిధిలో...

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో మాజీ మంత్రులు ఏరాసు ప్రతాప్‌రెడ్డి, గంటా శ్రీనివాసరావులు, సినీనటుడు అశోక్‌కుమార్ పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు.

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

పగిడ్యాల: రాజ్యాంగ పరంగా, ప్రభుత్వ పరంగా షెడ్యూల్ కులాలకు కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ భారతి, ఎంపీడీఓ వెంకటరమణ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పడమర ప్రాతకోట ఎస్సీ కాలనీలో సర్పంచ్ శేషమ్మ అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి సమత యశోదర, ఇషాంబాషా తదితరులు ఉన్నారు.

జలాధివాసం వీడుతున్న సంగమేశ్వరుడు



గోమాత కొమ్ముల మధ్యన సంగమేశ్వరాలయం



అడుగు లోతు మాత్రమే నీళ్లలో ఉన్న ప్రధాన ఆలయం(ఇన్‌సెట్) ఆలయ ప్రాంగణం క్లీన్ చేస్తున్న దృశ్యం

పాములపాడు: సప్తనదుల సంగమేశ్వరంలో సంగమేశ్వరుడు జలాధివాసం వీడుతున్నాడు. కేవలం అడుగులోతు నీళ్లు మాత్రమే ఉండటం ఇక రెండు రోజుల్లో స్వామి వారు పూర్తిగా బయటపడనున్నారు. భీష్మ ఏకాదశి ఫిబ్రవరి 3వ తేదీ నాటికి భక్తులకు దర్శన భాగ్యం కలుగుతుందని అర్చకులు తెలకపల్లి రఘురామశర్మ తెలిపారు. ఇందు కోసం ప్రధాన ఆలయం ముఖ మండపం, ఆలయ ప్రాంగణంలో క్లీనింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. ఫిబ్రవరి 4న భీష్మ ఏకాదశి పర్వదినాన స్వామి వారి తొలి దర్శనం, పూజలు ప్రారంభమవుతాయి.

పనులు ప్రారంభించకుండానే నిధులు డ్రా

- ఉపాధి హామీ సామాజిక తనిఖీలో గుర్తింపు
- సిబ్బందిపై డ్వామా ఉన్నతాధికారుల ఆగ్రహం

మిడుతూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు సాధించడంలో నిర్లక్ష్యంగా ఉన్నారని, బల్క్‌మిల్క్ కేంద్రాల నిర్మాణాలు చేపట్టకుండానే నిధులు ఎలా డ్రా చేస్తారని సిబ్బందిపై నంద్యాల జిల్లా డ్వామా కార్యాలయ పర్యవేక్షణ అధికారి (మానిటరింగ్ ఎవాల్యూషన్ అధికారి) విజయ భాస్కర్ నాయుడు, డ్వామా ఏఓ నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఉపాధి పనులపై బహిరంగ సభ నిర్వహించారు. ఈ నెల 19 నుంచి 30వ తేదీ వరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులపై అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో డీఆర్పీలు సామాజిక తనిఖీ నిర్వహించి గ్రామ సభలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన బల్క్‌మిల్క్ కేంద్రాల నిర్మాణాలకు నిధులు మంజూరుకాగా, నిర్మాణాలు చేపట్టకుండా లక్షల్లో మొత్తాన్ని డ్రా చేసుకున్నట్లు బట్టబయలైంది. ఈ విషయమై ఇంజినీర్ అసిస్టెంట్లు సరైన సమాధానం చెప్పకపోవడం గమనార్హం. ఈ నిధుల విషయంపై పంచాయతీరాజ్ ఎస్ఈకి విచారణ నిమిత్తం పంపుతామని డ్వామా పర్యవేక్షణ అధికారి తెలిపారు. అదేవిధంగా వందల సంఖ్యలో మొక్కలు నాటి.. పదుల సంఖ్యలో బతకడంపై ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లపై మండిపడ్డారు. కార్యక్రమంలో ఆత్మకూరు క్లస్టర్ ఏపీడీ అన్వారాబేగం, విజిలెన్స్ అధికారి పక్కీరప్ప, నంద్యాల క్లస్టర్ ఏపీడీ బాలాజీనాయక్, ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి, ఏపీఓ జయంతి, వలీబేగ్ తదితరులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహిస్తున్న అధికారులు